క్లుప్తంగా

ఆర్ఆర్ఆర్ సెంటర్ ఉపయోగించుకోవాలి

చొప్పదండి: పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ వస్తువులు, సామాన్లు సెంటర్‌లో వేయాలని కోరారు. ఇటీవలే ప్రారంభించిన సెంటర్‌కు ఉపయోగములో లేని వస్తువులు స్వచ్ఛందంగా తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులు సేకరించేందుకు సెంటర్ ఉపయోగపడుతోందన్నారు. పద్నాల్గో వార్డు ప్రజలు ఉపయోగించుకొనేందుకు మున్సిపల్ కార్యాలయం పక్కన సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు.

పరామర్శ

చొప్పదండి: పట్టణంలోని ఒకటో వార్డు కౌన్సిలర్ కొట్టె అశోక్ సోదరుడు, దండె చిన్న మల్లయ్య ఇటీవల మృతి చెందారు. మంగళవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట ముద్దం తిరుపతిగౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, పురం రాజేశం, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మావురం రాములు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

సైదాపూర్: సొంత జాగా ఉంటే డబుల్ బెడ్ రూమ్ ఇల్లుకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, ఇప్పటికైనా సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

తరలిరావాలి

చొప్పదండి: జిల్లా కేంద్రంలో ఈ నెల 31న నిర్వహించే శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి దీవెన కోరారు. పట్టణంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బొట్టుపెట్టి శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారు. వెంట శ్రీనివాస్, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన వివాహిత శివరాత్రి కనకవ్వ ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులకు మేము సైతం గ్రామ సేవకే అనే స్వచ్ఛంద సంస్థ రూ.ఐదువేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న మేనేజర్ రమేశ్

రామడుగు: మండల కేంద్రంలో కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో మంగళవారం ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. గుండి గోపాల్‌రావుపేట బ్యాంకు మేనేజర్ రమేశ్ మాట్లాడుతూ.. ఖాతాదారులు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన చేసుకోవాలని సూచించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ అనిల్‌కుమార్, సాగర్ పలువురు పాల్గొన్నారు.

ఇక అన్నీ ఒకేచోట

- హుజూరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- వేగంగా సాగుతున్న పనులు
- రూ. 4.50 కోట్లతో 76 గుంటల స్థలంలో నిర్మాణం
- వెజ్, నాన్‌వెజ్, ఇతర వస్తువులు ఒకేచోట లభ్యం
- త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం



హుజూరాబాద్‌లో చురుగ్గా సాగుతున్న సమీకృత మార్కెట్ పనులు

ఇరుకు మార్కెట్...అధ్వానంగా పారిశుధ్యం.. ఒక్కో ఆహార, ఇతర వస్తువుల కోసం ఒక్కో చోటుకి వెళ్లాల్సి రావడం వంటి సమస్యలకు ఇక చెల్లు. రోడ్లపై కూరగాయలు, చేపలు, మాంసం విక్రయాలకు కూడా బ్రేక్ పడనుంది. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లతో బాధలు తీరనున్నాయి.

హుజూరాబాద్: ప్రతి మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా హుజూరాబాద్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్లు జీవో 65 ప్రకారం టీయూఎఫ్ఐడీసీ నిధులను కేటాయించింది. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పట్టణం మధ్యలో నిర్మాణం చేయాలని ప్రభుత్వం ఆదేశించగా అధికార యంత్రాంగం అనువైన స్థలం కోసం అన్వేషించింది. కరీంనగర్ రోడ్డు, సైదాపూర్ రోడ్డులోని భూములను మొదట్లో పరిశీలించారు. అయితే సరైన స్థలం లభ్యంకాకపోవడంతో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ స్థలం మార్కెట్‌కు అనుకూలంగా ఉంటుందని భావించారు. ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించడంతో ఇక్కడ ఉన్న ఆర్డీవో కార్యాలయాన్ని కేసీ క్యాంపునకు తరలించారు. 76 గుంటల స్థలాన్ని మార్కెట్ నిర్మాణానికి కేటాయించగా నిర్మాణ పనులు 2022 మే నెలలో చేపట్టారు. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి.

మూడు నెలల్లో అందుబాటులోకి

రెండు ఫ్లోర్‌ల స్లాబులు పూర్తి కాగా, కూరగాయల స్టాల్స్ పనులు పూర్తి దశకు చేరాయి. 34 స్టాల్స్ పూర్తికాగా, రెండో ఫ్లోర్‌లో స్టాల్స్ పనులు జరుగుతున్నాయి. అయితే ఈ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వివిధ కారాణాల వల్ల ఆలస్యమైందని అధికారులు తెలిపారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఒకే చోట వెజ్, నాన్‌వెజ్ విక్రయాలు

సమీకృత మార్కెట్‌లోనే వెజ్, నాన్‌వెజ్ విక్రయాలతోపాటు ఇతర వ్యాపారాలు ఒకే చోట కొనసాగనున్నాయి. ఇందుకు నాన్ వెజ్ కోసం 32 స్టాల్స్, వెజ్ స్టాల్స్ 72, పూల వ్యాపారుల కోసం 24 స్టాల్స్‌ను నిర్మించనున్నారు. ఇప్పటికే 60 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రత్యేక డిజైన్‌తో మార్కెట్లను నిర్మించనున్నారు. జమ్మికుంట పట్టణంలోని పాతమార్కెట్ యార్డు ఏరియాలో రూ.3 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు ఫస్ట్, సెకండ్ ఫ్లోర్ స్లాబు పనులు పూర్తి కాగా స్టాల్స్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ కూడా మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

90 శాతం పనులు పూర్తి



సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లలో స్టాల్స్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి. పనుల్లో మరింత వేగం పెంచాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. నిర్మాణ పనులను తరుచూ సందర్శించి పరిశీలిస్తున్నాం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది.

– సాంబరాజు, మున్సిపల్ ఇంజినీర్, హుజూరాబాద్

వివిధ గ్రామాల్లో సివిల్ రైట్స్ డే

శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లి గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. షెడ్యూల్ కులాలు, తెగలపై అంటరానితనం నిర్మూళన కోసం ప్రతినెల పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. సర్పంచ్ రంజిత్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సదాశివరెడ్డి, కార్యదర్శి రవి ,జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఓదెల రాజయ్య, గరిగే ప్రభాకర్ పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీలో పౌరహక్కుల దినోత్సవం సర్పంచు వేముల లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. సమస్యలు పరిష్కార మార్గాలపై చర్చించారు. ఎంపీవో జనార్దన్‌రెడ్డి, డీటీ చంద్రశేఖర్, నాయకులు అంజి, వినోద్, ద్యావ శ్రీనివాస్, ద్యావ సంజీవ్, నగేశ్, ఆర్ఐ శ్రీనివాస్, హెచ్‌సి జయపాల్‌రెడ్డి, కార్యదర్శి రాజు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అధికారులు గ్రామస్తులకు చట్టాలపైన అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామని ఏఎస్సై గుడి అనంతరెడ్డి తెలిపారు. సర్పంచ్ జంగిలి శ్రీలత రాజమౌళి, సీనియర్ అసిస్టెంట్ శంకర్, శ్రీనివాస్, ఆర్ఐ బాలకిషన్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు వెల్పుల రవి, పోచయ్య, ప్రశాంత్, నర్సయ్య, మునయ్య పలువురు పాల్గొన్నారు.

చొప్పదండి: సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అభివృద్ధి జరుగాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని దేశాయిపేటలో నిర్వహించిన సివిల్ రైట్స్ డేలో మాట్లాడారు. నాయబ్ తహసీల్దార్ కళావతి, ఆర్ఐ అరుణ్ కుమార్, సర్పంచ్ రవి, ఉప సర్పంచ్ వెంకట్ రాంరెడ్డి, ఏఎస్ఐ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ముంచింది



గంగాధరలో తడిసిన వరి ధాన్యం బస్తాలు



వర్షానికి కొట్టుకుపోయిన మక్కలు

- వర్షానికి తడిసిన వరి, మొక్కజొన్న

జమ్మికుంట/గంగాధర: చేతికి వచ్చిన పంట నీటిపాలవుతోంది. జమ్మికుంట వ్యవసాయ కొత్త మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మొక్కజొన్నలు తడిసిపోయాయి. మొక్కజొన్న రాసులపై టార్పాలిన్లు కప్పినా తీవ్రంగా వీచిన గాలిదుమారంతో ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటవెంటనే కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నా కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే గంగాధర మండల పరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి ఉంచిన వరిధాన్యం బస్తాలు తడిసిపోయాయి. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం తూకం వేసి నాలుగైదు రోజులు గడుస్తున్నా లారీలు రాక బస్తాలు కేంద్రంలోనే ఉండిపోయాయి. రాత్రి కురిసిన వర్షానికి బస్తాల అడుగుభాగం తడి సిపోయాయి. రైతులు బస్తాలను తిప్పి వేస్తూ ధా న్యం ఎండబెట్టడానికి తంటాలు పడుతున్నారు. తూకం వేయగా మిగిలిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ప్రతినిధులు, తదితరులు

గంగాధర: వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలేటర్ తాళ్ల వెంకటేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో యూనిసెఫ్, ఐసీడీఎస్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికా హారం తదితర విషయాలను ఐసీడీఎస్ ప్రతినిధులు శైలజ, అఖిల్ వివరించారు. ఐసీడీఎస్, హోమ్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శానిటరీ కప్, ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసారం శైలజ, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వార్డు కమిటీలు



వార్డు అధ్యక్షులు, తదితరులతో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల బీఆర్ఎస్ కమిటీలను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కౌన్సిలర్ల అధ్యక్షతన మంగళవారం ఎన్నుకున్నారు. ఏడోవార్డు అధ్యక్షుడిగా కాటిపల్లి మధుసూధన్‌రెడ్డి, 17వార్డు అధ్యక్షుడిగా పుల్లూరి సదానందం, నాల్గో వార్డు అధ్యక్షుడిగా లాడే రామారావు, ఐదో వార్డు అధ్యక్షుడిగా గట్టు మల్లికార్జున్, 16వ వార్డు అధ్యక్షుడిగా ఎల్కపల్లి రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు , పొనగంటి సారంగం, జుగురు సదానందం, ఎలగందుల స్వరూపశ్రీహరి, పిట్టల శ్వేతరమేష్, కూతాడి రాజయ్య, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓగులాపూర్‌లో ఎల్లమ్మ జాతర



ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రముఖులు, గ్రామస్తులు

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. బైండ్ల పూజారులు ఆలయం ముందు పెద్దపట్నం వేసి ఎల్లమ్మ చరిత్ర కథ రూపంలో వినిపించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిని శ్రీనివాస్, ఉపసర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కోమటిరెడ్డి చంద్రకళ, మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జయ్‌పాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గట్టు శ్రీలత, గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్, మునిందర్, విగ్నేశ్ పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బీఎస్పీలో పలువురి చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామచంద్రం

తిమ్మాపూర్: మండల కేంద్రంలో మంగళవారం బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం కార్యక్రమానికి హాజరై పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి బీఎస్పీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సంపత్, ప్రభాకర్, మల్లయ్య, రాయమల్లు, అభిలాశ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయినప్పుడే ఆనందం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



రెడ్డి సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: గ్రామాల్లో అభివృద్ధి పనులు మొదలు పెట్టినప్పుడు కంటే పనులు పూర్తి చేసినప్పుడే చాలా ఆనందం కలుగుతుందని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో మూడున్నర కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం భవనాలను ఎంపీపీ కేతిరెడ్డి వనిత, సర్పంచ్ దుండ్ర నీలమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, సుతారి సంఘం భవనాలకు భూమిపూజ చేశారు. గత ఎమ్మెల్యేలు, రసమయి చేసిన అభివృద్ధిపై ప్రజలు చర్చించాలని కోరారు. పల్లెల్లో ప్రతి కులానికి సంఘ భవనం నిర్మిస్తున్నామని, ఆడబిడ్డలు పాలకులుగా ఉన్న గ్రామానికి దేశం అవార్డు అందజేసిందన్నారు. గోదావరి నీళ్లతో ప్రతీ ఊరు తడుస్తుందని, పార్టీలకు అతీతంగా సబ్బండ కులాల పురోగతికి కృషి చేస్తున్నామని, రైతును కన్న బిడ్డలా చూసుకుంటున్న గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. తిమ్మాపూర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తానని ఇందుకోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. యువకుల కోసం జిమ్, పిల్లల కోసం పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలన్నారు. రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిన తర్వాత గ్రామాలకు సరిపడా నిధులు వస్తున్నాయని, ఎమ్మెల్యే రసమయిని లక్ష మెజార్టీ తో గెలిపించాలని కోరారు. సర్పంచ్ నీలమ్మ మాట్లాడుతూ. గ్రామస్తుల అందరి సహకారంతోనే అభివృద్ధి జరిగిందని అన్నారు.

భారీ బైక్ ర్యాలీ....

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తిమ్మాపూర్ మండల కేంద్రం వరకు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. సుమారు 500 బైక్‌లతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వనితాదేవేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, రాష్ట్ర నాయకులు ఏకానందం , ఎంపీటీసీ మమత, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు చిన్న జోగిరెడ్డి, కేసీఆర్ యువసేన అధ్యక్షుడు విజయ్ రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్చార్జ్ వెంకట్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు దేవేందర్, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్, రాజేందర్, సాగర్ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరానికి స్పందన లభించిందని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు తెలిపారు. శిబిరంలో సుమారు 200 మందికి పైగా కంటి పరీక్షలు చేసి 60 మందికి అద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అర్పిత, కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్, వైద్యాధికారి ప్రత్యూష, ఏఎన్ఎం వనిత, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై సభ్యుల మండిపాటు

- ఎంపీపీ వినీత అధ్యక్షతన మండల సభ
- గ్రామాల్లోని సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు



ఎంఈవోను నిలదీస్తున్న ఎంపీటీసీ అందె స్వప్న

చిగురుమామిడి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి మూడో శనివారం పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశాలు ఎందుకు విజయవంతం కావడం లేదని, ఉపాధ్యాయుల కోఆర్డినేషన్ లోపం వల్లే విద్యార్థుల సంఖ్య పెరగడంలేదని ఇందుర్తి ఎంపీటీసీ అందె స్వప్నతో పాటు పలువురు సభ్యులు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిని నిలదీశారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన నిర్వహించారు. మధ్యాహ్నం ఇద్దరు సర్పంచులు, ఐదుగురు ఎంపీటీసీలతో సమావేశం ప్రారంభమైంది. గ్రామంలో మొదటి ఏఎన్ఎం లేక రెండో ఏఎన్ఎంపై పనిభారం పెరుగుతోందని, ఇతర పీహెచ్‌సీ నుంచి మొదటి ఏఎన్ఎంను డిప్యూటేషన్‌పై రప్పించాలని అందె స్వప్న కోరారు. చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ మాట్లాడుతూ... రేకొండ, ఇందుర్తి, బొమ్మనపల్లి గ్రామాల్లో మొదటి ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏడు ఆరోగ్య ఉపకేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉన్నందున ప్రజలు అక్కడే వైద్య పరీక్షలు చేసుకుంటున్నారని అన్నారు. వానాకాలంలో సబ్సిడీపై రైతులకు ఎలాంటి విత్తనాలు సరఫరా చేస్తున్నారని బొమ్మనపల్లి ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం ప్రశ్నించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు తెలియజేసేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారని, సమయం లేదని ఎలా చెబుతారని ఏఓ రంజిత్‌కుమార్‌ను నిలదీశారు. ఆరు రోజుల సమయం మాత్రమే ఇవ్వడం వల్ల దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు మాత్రమే నమోదు చేశామని ఏఓ సమాధానం చెప్పారు. యాసంగి ధాన్యం విక్రయించి పదిహే ను రోజులవుతున్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదని జెడ్పీటీసీ గీకురు రవీందర్ ఏవోను ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడితే స్థానిక ట్రాన్స్‌కో సిబ్బందికి ఫోన్ చేస్తే స్పందించడంలేదని చిన్నముల్కనూర్ సర్పంచ్ ముప్పిడి వెంకటనర్సింహారెడ్డి, మిడిల్ పోల్స్‌కు రూ.2.60 లక్షల డీడీ కడితే కేవలం 17 పోల్స్‌కు గాను 8 పోల్స్ మాత్రమే ఇచ్చారని చిగురుమామిడి సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్ ఆరోపించారు. ఇందుర్తి ట్రాన్స్‌కో ఏఈ రాజిరెడ్డి మాట్లాడుతూ.. చిగురుమామిడి ఏఈ మెటీరియల్ డ్రా చేసే అధికారం ఉందని, ఆయన ద్వారానే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ నీరు సరిగా రావడంలేదని పీచుపల్లి సర్పంచ్ పీచు లీలా, సుందరగిరి ఎంపీటీసీ మెడబోయిని తిరుపతి ప్రస్తావించారు. చా లా ఇళ్లకు నల్లాలు బిగించాల్సి ఉందని, ప్రస్తుతం సరఫరా అయ్యే తాగునీరు ప్రజలకు సరిపోవడం లేదన్నారు. సభ్యుల ఆరోపణలకు ఎంపీపీ సమాధానం ఇచ్చారు. అధికారులు చి త్తశుద్ధితో విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కరెంటు సిబ్బంది గ్రామాల్లో సరిగా స్పందించడంలేదన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్ ముబిన్‌అహ్మద్, డీఈఈ బా లరాజ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.